# దొమ్మరాట

దొమ్మరాట ఆడువారు బొందిలీ కులస్థులు. వీరి భాషకు లంబాడీభాషకు పోలిక ఉంటుంది. తెలుగు కూడా బాగామాట్లాడుతారు. వీరు గ్రామగ్రామాలు తిరుగుతూ వీరి ఆటను ప్రదర్శిస్తూ ఉంటారు. స్త్రీలు, పురుషులు ఈ ఆట ప్రదర్శనలో ఆరితేరి ఉంటారు. చిన్నప్పటి నుండి మొగపిల్లలకు, ఆడపిల్లలకు ఈ విద్య నేర్పుతారు. ఆడపిల్లలకు పెళ్లి అయిన తర్వాత అత్తవారింట్లో వారితోకలసి ఈ విద్య ప్రదర్శిస్తూ ఉంటారు. ఈ ఆటే వీరికి బ్రతుకుతెరువు. ప్రదర్శనకు ముందుగాడోలు వాయిస్తారు. డోలు వీరి ముఖ్యవాయిద్యము. డప్పు వాయిద్యము కూడా ఉపయోగించెదరు. ప్రదర్శన రోడ్డుప్రక్కన ఏర్పాటుచేసుకుంటారు. డోలువాద్యంవిని గ్రామస్థులందరూ రావటం మొదలుపెట్టినప్పుడు వేరు వేరు వయస్సుగల పిల్లలు పిల్లిమొగ్గలు వేయుచూ జనాన్ని ఆకర్షిస్తారు. తరువాత నిలబెట్టిన రెండు గుంజల మధ్య కట్టబడిన తీగపై ఒక పెద్దగడకర్రను చేత్తోపట్టుకొని నడచెదరు. పెద్దవారు కర్రపైకి ఎక్కి ముందుగా మెల్లగా నడుచుచూ తర్వాత చాలా వేగంగా నడచెదరు. తీగపై గుండ్రంగా ఉన్న ఒక చెక్కను అమర్చి దానిపై ఒక స్త్రీ ఎక్కి సైకిల్ నడుపుచున్నట్లు తీగపై నడుపును. ఆ చెక్కపై అటు ఇటూ తిరుగుచూ తాను పైకి తీసికొనివెళ్లిన వేపాకును క్రిందికి వేయును. ఆ విధంగా వేయుట శుభసూచికంగా గ్రామస్థులు భావించి కరతాళధ్వనులు చేస్తారు.

ఇనుపకడ్డీని ఛాతీతో వంచుట. మనిషి పొట్టపై ఒకగడకర్రను నించోపెట్టి దానిపైకి చిన్నపిల్లలు ఎక్కి గడపైకూర్చొనుట, కూర్చొనిన తరువాత అక్కడే ఉండి డప్పు వాయించుట చేయును. 50 కిలోల రాయిని పైకిలేపుట. పల్టీలుకొట్టుటచేసి ప్రజలమన్ననలను పొందెదరు. వీరి ప్రదర్శన ఆద్యంతరం. వీరి డోలు వాద్యంతోపాటు ప్రజల తప్పట్లు, ఈలల మధ్య ఎంతో రసవత్తరంగాసాగును.

వీరు ఆంధ్రప్రదేశ్‌లోని చాలా జిల్లాలలో ఉన్నారు. ఒక గ్రామము నుండి ఇంకొక గ్రామమునకు వెళ్లి ప్రదర్శించుచూ బ్రతుకుతెరువు సాగించుచున్నారు. ముఖ్యముగా తూర్పుగోదావరి జిల్లా, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలో ఉన్నారు